క్లుప్తంగా

వైభవంగా బోనాల పండగ



వాకపల్లిలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో కొల్లాపూర్ మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండగ గురువారం వైభవంగా జరిగింది. మహాశక్తి పీఠాధిపతి కాళీలక్ష్మీ ప్రసన్నానంద మాతాజీ పర్యవేక్షణలో వాకపల్లి, పోతులూరు గ్రామాలకు చెందిన మహిళా భక్తులు అమ్మవారి బోనాలను శిరస్సున ధరించి మహాశక్తి పీఠం నుంచి శాంతిఆశ్రమంలోని సత్తెమ్మతల్లి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొల్లాపూర్ మహాలక్ష్మి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ర్యాలీలో మంగళ వాయిద్యాలు, గరగ నృత్యాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దారి పొడవునా అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి సారె, చీరలు సమర్పించారు. మధ్యాహ్నం మాతా మహాశక్తి పీఠం ఆవరణలో భారీ అన్నదానం నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్ర ఉత్తర కోస్తా జిల్లాల అధ్యక్షులు సాన సూకరాజు నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టీ స్టాల్స్‌లో తనిఖీలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండల పరిధిలో ఉన్న టీ స్టాల్స్‌లో గురువారం తనిఖీలు నిర్వహించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. టీ స్టాల్స్ వద్ద చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్సై చంద్రశేఖర్, హైవే మొబైల్ సిబ్బంది ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



పెద్దనాపల్లిలో సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో సచివాలయ ఉద్యోగులను గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సత్కరించారు. సచివాలయ ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. వ్యవసాయ, ఉద్యాన సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై మూడురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాన్యువల్ టెస్టింగ్‌పై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మాన్యువల్ టెస్టింగ్‌లో కీలక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకూ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమను తాము మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధికారి కె.లక్ష్మివివేక, కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు తదితరులు పాల్గొన్నారు.

'సాగంటి' ఆశయ సాధనకు కృషి చేయాలి



రాజారావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు దుర్గాప్రసాద్

జగ్గంపేట: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు సాగంటి రాజారావు ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక యాదవ కల్యాణ మండపంలో గురువారం సాగంటి రాజారావు నాల్గో వర్ధంతి సభ నిర్వహించారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మరుకుర్తి ఏసు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సాగంటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాజారావు యువకుడిగా ఉన్నప్పుడే విప్లవానికి ఆకర్షితుడైనట్టు తెలిపారు. పీడిత ప్రజల కోసం విప్లవోద్యమంలో అనేక చిత్రహింసలు, ఎదుర్కొని జైలు జీవితం గడిపారని, తుది శ్వాస వరకూ ప్రజల పక్షాన పోరాటాలు చేశారన్నారు. పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.వెంకటనాయుడు, జె.సత్తిబాబు, బొజ్జిరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రైతుపైనే బీమా భారం

- వరికి ఎకరాకు రూ.769 చెల్లింపు
- వచ్చే నెల 15 వరకూ గడువు
- మెట్టలో ఇంకా నాట్లు పడని వైనం



డి.పోలవరంలో వర్షాభావంతో ఖరీఫ్ వరి నాట్లు వేయని భూములు

తుని రూరల్: ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు పంటల బీమా ఆసరా నిలుస్తుంది. కాగా కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం భారాన్ని రైతన్నలపైనే రుద్దేసింది. ఈ సంవత్సరం వరి పంటకు ఎకరాకు రూ.769 చొప్పున రైతులే చెల్లించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. డెల్టా ప్రాంతంలో ఇప్పటికే ఖరీఫ్ వరినాట్లు జరుగుతుండగా వర్షాభావ పరిస్థితులతో మెట్ట రైతులు నారుమడుల దశ దాటలేదు. ఖరీఫ్ కాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ మెట్టలో నాట్లు పడక భూములు మోడివారే ఉన్నాయి. నారు ఉన్నా నాట్లుకు నీరు లేని పరిస్థితులు నెలకొన్నాయి. వర్షపాతం సైతం సాధారణ కంటే తక్కువగా నమోదైంది. ఈ దశలో బీమా ప్రీమియం చెల్లించడంపై రైతులు మల్లుగుల్లాలు పడుతున్నారు. గడువు సమీపిస్తున్నందున నారుమడులు వేసినా బీమా రైతులు ప్రీమియం చెల్లించొచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

38 వేల ఎకరాల్లో సాగు

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది 25 వేల మందికిపైగా రైతులు 38 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేస్తారని అంచన. 38 వేల ఎకరాలకు రూ.769 చొప్పున బీమా ప్రీమియం చెల్లిస్తే రైతులపై రూ.2.92 కోట్లు భారం పడనుంది.

రైతులకు అండగా గత ప్రభుత్వం

అతివృష్టి, అనావృష్టి, తుపాన్లు సంభవిస్తే వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లేది. అవగాహన, అవకాశం ఉన్న రైతులు నేరుగా పంటల బీమా చెల్లించేవారు. రైతుల కష్టాలు చూసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బీమా ప్రీమియం మొత్తం చెల్లించేది. విషయం తెలియడం కోసం రైతులు ఎకరాకు రూపాయి చెల్లిస్తే సరిపోయేది. కొన్నేళ్లు అలాగే కొనసాగింది. 2019–24 మధ్య అధికారంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపాయి కూడా రైతులకు భారం కాకూడదని భావించి మొత్తం బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా బీమాతో రైతులకు ధీమా ఏర్పడింది.



డి.పోలవరం నారప్ప చెరువులో అడుగంటిన సాగునీరు



బీఎస్ పేటలో బోరుబావి కింద వేసిన నారుమడి

కూటమి రాకతో కష్టాలు ప్రారంభం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీమా ప్రీమియం చెల్లింపుల్లో పూర్వపు విధానాలను తెరపైకి తెచ్చారు. గత సంవత్సరం ఆగస్టులో ఉద్యాన రైతులు నేరుగా బీమా ప్రీమియం చెల్లించాలని ఆ శాఖ అధికారులు రైతులను చైతన్యపర్చే కార్యక్రమాలు నిర్వహించారు. రైతుల నుంచి స్పందన కరువైంది. తుని సబ్ డివిజన్‌లో వేల ఎకరాలు పండ్ల తోటలు ఉన్నప్పటికీ ఎక్కువ మంది రైతులు బీమా చెల్లించలేదు. మళ్లీ ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వరిసాగు చేసే రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారు. దీనికి ఆగస్టు 15వ తేదీ గడువుగా నిర్ణయించారు.

తుని సబ్‌డివిజన్‌లో ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం అంచనాలు

మండలం	సాధారణ వరిసాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	నారు వేసిన విస్తీర్ణం (హెక్టార్లలో)
తుని	2731	15
తొండంగి	5193	45
కోటనందూరు	4023	43
రౌతులపూడి	2066	55
శంఖవరం	1111	16

బీమాతోనే రైతులకు ధీమా

పంటల బీమాతో రైతులకు ధీమా ఏర్పడుతుంది. కరవు, తుపాన్లు, వరదలు సంభవించి పంట దెబ్బతింటే రైతులకు నష్టపరిహారం లభిస్తుంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఎకరా వరికి రూ.769గా బీమా ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మొత్తాన్ని రైతులే నేరుగా బీమా సంస్థకు చెల్లించాలి. ఆగస్టు 15వ తేదీతో గడువు ముగుస్తుంది. నాట్లు వేసిన రైతులతో పాటు నారుమడులు వేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లింపునకు అర్హులే. మరిన్ని వివరాలను ఏఓలు, ఏఈఓలు, వీఏఏలను అడిగి తెలుసుకోవచ్చు.

– జీవీ పద్మశ్రీ, ఏడీఏ, తుని

28న వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం సమావేశం



తోట నరసింహం

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం సమావేశాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28న కాకినాడలోని సూర్యకళా మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం సభ్యులు, పార్టీ దళిత నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



గోకవరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోకవరం: విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో స్థానిక సీఎండీ లేఅవుట్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బీజేపీ నాయకుడు వరసాల ప్రసాద్, మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన సన్‌స్టార్ ఆస్పత్రి వైద్యులు ఎస్.సుధాకర్, జె.కోదండరామ్, కె.రాజేష్, కె.భాగ్యప్రీతి సుమారు 300 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ముద్రగడ త్వరగా కోలుకోవాలని పూజలు



వేలంక ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



రౌతుపాలెంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు(పీఏసీ) ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ గురువారం ఆ పార్టీ నాయకులు, అభిమానులు పూజలు చేశారు. వేలంక ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆయుఆరోగ్యాలతో స్వగ్రామానికి తిరిగి రావాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దోమాల గంగాధర్, నీలగిరి చిట్టిబాబు, దోమల కృష్ణజడ్డి, బేతాల భాస్కరరావు, అడబాల శ్రీను, దోమాల రాజా తదతరులు పాల్గొన్నారు.

రౌతుపాలెంలో..

ప్రత్తిపాడు రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ గురువారం ఆ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రౌతుపాలెం సాయిబాబా మందిరంలో భజనలు, కీర్తనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, గోళ్ల నాగేశ్వరరావు, గొల్లపల్లి దొరబాబు, నేదుళ్ల శ్రీను, ముద్రగడ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అమావాస్య పర్వదినం సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి గురువారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 30 మంది భక్తులు రూ.750తో టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి రూ.45 వేలు ఆదాయం సమకూరింది. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, వన దుర్గ ఆలయ పరిచారకులు చిట్టెం వాసు, వేణు, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

నేడు చండీహోమం

శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా వన దుర్గ అమ్మవారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు చండీహోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జరిమానా

కిర్లంపూడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురికి కోర్టు జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ గురువారం తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు కోర్టుకు హాజరు పరచగా ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష, మరో ఐదుగురికి రూ.10 వేలు చొప్పున రూ.50 వేల జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులకు ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులకు ప్రాథమిక సిద్ధాంతాలు, క్యూబిట్స్, క్వాంటమ్ గేట్స్, శోర్, తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు ఆర్‌వీఎస్ లలిత రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తారన్నారు. అలాగే అల్ట్రాటెక్ సహకారంతో అప్లికేటర్‌పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రావికంపాడు–కత్తిపూడి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతులు చేపడతామన్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ, చిన్నతరహా, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా



కోటనందూరు బస్టాండ్ సెంటర్‌ను డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

కోటనందూరు: అసాంఘిక కార్యకలాపాలను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్, గ్రామ శివారు ప్రాంతాలను గురువారం ఆయన డ్రోన్లతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, మందుబాబుల ఆగడాలు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతున్నామన్నారు. డ్రోన్ల పర్యవేక్షణతో నేరగాళ్లను త్వరితగతిన పట్టుకుని శిక్షించే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యవంతమైన దిగుబడులు

- ఏడీఏ పద్మశ్రీ
- వ్యవసాయ, ఉద్యానశాఖ అసిస్టెంట్లకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ పద్మశ్రీ

రౌతులపూడి: రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని తుని వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ జీవీ పద్మశ్రీ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం రౌతులపూడి, శంఖవరం, కోటనందూరు మండలాల్లోని వ్యవసాయ, ఉద్యానశాఖ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. రైతులకు ప్రకృతి సాగులో సస్యరక్షణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్‌ట్రైనర్ డి.వరలక్ష్మి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

జగ్గంపేట: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జగ్గంపేట ఏడీ జి.శ్రీనివాస్ సూచించారు. గ్రామంలో మండల వ్యవసాయాధికారి నరసింహం ఆధ్వర్యంలో వీఏఏలకు, వీహెచ్‌ఏలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ఏడీఏ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా వారిని చైతన్య పరచాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గండేపల్లి ఏఓ రెడ్ల శ్రీరామ్, ఉద్యానవన అధికారి శ్రీవల్లి, మాస్టర్ ట్రైనర్ గణేష్, ఏఈఓలు చంద్రమౌళి, వసంత, జగ్గంపేట, గండేపల్లి మండలాల వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు పాల్గొన్నారు..

భూమిని సంరక్షించుకోకుంటే వినాశనమే

తుని రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిని సంరక్షించుకోకపోతే వినాశనమేనని వ్యవసాయ సహాయ సంచాలకులు జీవీ పద్మశ్రీ అన్నారు. తుని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, రైతుల్లో చైతన్యం తీసుకురావడంపై వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలకు మూడు రోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సేంద్రియ సాగుపై రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్లు అడిగర్ల రామకృష్ణ, గోవిందురాజు, ఏఓలు అశోక్‌కుమార్, రాబిన్ సుదర్శన్, గాంధీ, చంద్రశేఖర్, తుని, తొండంగి మండలాల వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలు పాల్గొన్నారు.

జోరువాన

- అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం



దానవాయిపేట సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు



ఏలేశ్వరంలో రహదారిపై నిలిచిపోయిన వర్షపునీరు



అచ్చంపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా గురువారం విస్తారంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏలేశ్వరం వారపు సంతతో కొనుగోలుదారులు అవస్థలు పడ్డారు. వర్షాలకు చెరువుల్లోకి కొంతమేర వర్షపునీరు చేరింది. వర్షాలతో రైతులు ఖరీఫ్ పనులు ముమ్మరం చేశారు. పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. వర్షాలకు రహదారులు బురదమయంగా మారడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా అధికారులు పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తొండంగి మండలంలో..

తొండంగి: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులు నుంచి ఆకాశం మేఘావృతమై వర్షాలు కురుస్తున్నారు. మండలంలోని బెండపూడి, కొమ్మనాపల్లి, రావికంపాడు, సీతారాంపురం, ఎ.కొత్తపల్లి, తొండంగి, శృంగవృక్షం, పి.ఇ.చిన్నాయపాలెం తదితర ప్రాంతాల్లో దమ్ములు, వరినాట్లు ప్రారంభమయ్యాయి. మరోవారం రోజుల్లో మండలంలోని వరినాట్లు పనులు ముమ్మరంగా సాగనున్నాయి. మండలంలోని పీబీసీ, పంపా, వ్యవసాయ బోర్లు కలిపి మొత్తం 16 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు జరుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారి ఎంవీవీఎస్ పద్మశ్రీ తెలిపారు. వర్షాలకు బెండపూడి, ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం, ఏవీ నగరం, కోదాడ, కృష్ణాపురం గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

తీరంలో ఎగసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తీరప్రాంతంలో అలలు ఉవెత్తున ఎగసిపడుతున్నాయి. అద్దరిపేట, పంపాదిపేట, యత్రయ్యపేట, కొత్తపేట, జి.ముసలయ్యపేట, ఎల్లయ్యపేట, దానవాయిపేట, వాడముసలయ్యపేట, తాటియాకులపాలెం, వాకదారిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట సముద్రతీరాల్లో సముద్ర అలలు సుమారు రెండు మీటర్ల ఎత్తులో ఎగసిపడుతున్నాయి. తీరప్రాంతంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు తీరంలో లంగరు వేసిన బోట్లను ఒడ్డున సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.

తెరిపివ్వని వాన

శంఖవరం: మండలవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో వరి నాడుమడులు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, కొతంగి గ్రామాల్లో పెద చెరువులు నిండికుండల్లా దర్శనమిస్తున్నాయి. గాలివానకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేసే వారు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

వైభవంగా చౌడేశ్వరిమాత జయంతి



తునిలో చౌడేశ్వరిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తుని: స్థానిక పల్లపువీధిలో వేంచేసిన గౌరీశంకర సమేత వీరభద్రస్వామి ఆలయంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో చౌడేశ్వరి మాత జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢ అమావాస్య సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కుందెం కిరణ్‌కుమార్, కుమారి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాంగ సంఘ ప్రతినిధులు పట్టణ వీధుల్లో చౌడేశ్వరి అమ్మవారిని ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో దేవాంగ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ దొంతంశెట్టి నందిమల్లికార్జునరావు, కుందెం సత్యనారాయణ, మాదన వీరభద్రరావు, డాక్టర్ బూడిద వీరభద్రుడు, తూతిక సూర్యనాగేశ్వరరావు, మాదన భోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పీ4 సర్వే

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం సచివాలయంలో గురువారం పీ4 సర్వే నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి అధ్యక్షతన జరిగిన సభలో పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ పీ4 సర్వేలో 1280 మందిని గుర్తించినట్లు తెలిపారు. సచివాలయం–1 పరిధిలో 411, సచివాయం–2లో పరిధిలో 402, సచివాలయం–3 పరిధిలో 467 మందిని గుర్తించినట్లు వివరించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పీ4 సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జువ్వల బాబులు, సొసైటీ చైర్మన్ దాసం శేషారావు, జువ్వల బాబులు, ఊటా వీరబాబు, ఊబా కృపావరం, కుప్పిన శ్రీను, గొనగాల గోపి తదితరులు పాల్గొన్నారు.